
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 191 -
# నాలుగో జులపాల కథ

**అప్పుడెప్పుడో కోవిడ్ ముందు భారత్** వెళ్ళి, మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత గత నెలలో డోహా, ఖతార్ లో రెండు రోజులు ఆగి, అక్కడ సంక్రాంతి సంబరాలలో శాలువా కప్పించుకుని, పతకం అంది పుచ్చుకుని కాకినాడలో అడుగుపెట్టాను. హాయిగా మా మామిడి చెట్టు క్రింద కూచుని కాఫీ తాగుతూండగా మా క్వీన్ విక్టోరియా నేను హ్యూస్టన్ లో బయలుదేరడానికి వారం ముందు ఇచ్చిన సలహా అనండి, ఆదేశం అనండి....అది గుర్తుకొచ్చింది. "ఆ వెధవ జులపాలు వేసుకుని కాకినాడలో దిగితే బైరాగి అనుకుంటారు. వెళ్ళి  క్షవరం చేయించుకుని రా". అదీ ఆవిడ ఆదేశం. అప్పుడు నేను లెక్కలు వేసుకుని అమెరికాలో అయితే 30 డాలర్లు, అదే భారత్ లో అయితే మా ఆస్థాన మంగలి ప్రొ. వీర్రాజు ఇంటికే వచ్చి రూపాయి పావలాకే చేసే రోజులూ, ఆ వీర్రాజూ కూడా పోయినా వాడి మనవడు వీర్రాజు మహా అయితే వంద రూపాయలకి అదే పని చేస్తాడుగా.. అనగా రెండు డాలర్ల లోపే... 28 డాలర్లు సేవింగ్... అనుకుని "ఇప్పుడు టైమ్ లేదు. కాకినాడ వెళ్ళగానే చేయించుకుంటాలే" అని ఆవిడకి నచ్చ చెప్పి ఒప్పించాను. ఆ వాగ్దానాన్ని నెరవేర్చాలి కాబట్టి కాకినాడలో మా డ్రైవర్ని వీర్రాజు గురించి వాకబు చేస్తే "అయన్నీ ఇప్పుడు లేవండి. మనం ఆళ్ళ కొట్టుకెల్లాలి కానీ ఆళ్ళు మనింటికి రారండి. కాకినాడలో కార్పొరేట్ మంగలి సాపులొచ్చేశాయండి" అని నన్ను ఒక నాలుగు అంతస్తుల భవనం లో రెండో అంతస్తులో ఉన్న ఒకానొక అత్యాధునిక ప్రదేశానికి తీసుకెళ్ళాడు.




ఆ కొట్టు పేరు "ఇక్కడ అందముగా క్షవరము చేయబడును– ప్రొ. వీరాజు" లా లేనే లేదు. దాని పేరు "టోనీ అండ్ గై"–  హైర్ డ్రెస్సింగ్. పైన గాజు తలుపుల మీద చైనా, అమెరికా, ఆఫ్రికా జాతుల అమ్మాయిల విలాసవంతమైన ఫొటోలే. లోపల అంతా ఆర్భాటంగా, ఎంతో ఖరీదుగా ఉంది. ఎదురుగా ఒక కంప్యూటరూ....దాంతో ఆడుకుంటూ ఒక గెడ్డం మాసిన యువకుడూ...భారత్ సంప్రదాయం ప్రకారం లేచి నుంచుని

"ఎందుకొచ్చావ్?" అన్నట్టు నా కేసి చూసి గుడ్ మార్నింగ్ అన్నాడు. నేను వచ్చిన పని చెప్పాను. జుట్టుకి రంగు అనగానే వాడు కంప్యూటర్ లో ఒక నొక్కు నొక్కి, మా దగ్గర ఎరుపు, నీలం, పసుపు, వాటి మిక్సింగ్ ఉన్నాయి. వాటిల్లో సెలెక్ట్ చేసుకోమనగానే అలాంటి రంగు జుట్టుతో నన్ను చూస్తే క్వీన్ విక్టోరియా రియాక్షన్ ఎలా ఉంటుందా అని తల్చుకోగానే నాకు చెమట్లు పట్టాయి. వెంటనే ఆ యువకుడిని వారించి, కంప్యూటర్ మూయించి, సహజసిద్ధంగా ఉండే నలుపు రంగు మాత్రమే వెయ్యడానికి ఒప్పించాను. కాస్సేపు అలా కూచో, ఏర్పాటు చేస్తాను అని ఆ యువకుడు అనగానే ఆ ఖరీదైన సోఫాలో చతికిల పడ్డాను. అప్పుడే ఎదురుగా ఉన్న ఒక ఫొటో చూసి నవ్వాలో, ఏడవాలో తెలియ లేదు.  గొప్ప బాలీవుడ్ సినీ నటుడు కాకినాడ వచ్చినప్పుడు సరిగ్గా నా లాగే తన జులపాలు కత్తిరించుకోడానికి ఇప్పుడు నేను వచ్చిన చోటికి వచ్చిన ఫొటో..అని వ్రాసి ఉంది. ఆ ఫొటో ఇక్కడ జత పరిచాను. అయితే ఈ బార్బర్ షాప్ లో చెవిలో పువ్వులు కూడా పెడతారు అనీ, ఫొటో షాప్ లో కూడా వారికి మంచి ప్రతిభాపాటవాలు ఉన్నాయి అనీ నాకు భలే ముచ్చట వేసింది. లేకపోతే అమీర్ ఖాన్ కాకినాడ రావడం ఏమిటీ? రాగానే క్షవరం చేయించుకోవడం ఏమిటి? నమ్మండి, నమ్మక పొండి..ఆ ఫొటోలో ఉన్నది అమీర్ ఖాన్, పక్కనే ఇందాకా నన్ను పలకరించిన గెడ్డం మాసిన యువకుడే!.



ఇక ఆ సోఫాలో కూచుని సెల్ ఫోన్ లో తలదూర్చగానే ఇద్దరు అందమైన అమ్మాయిలు కిచ కిచలాడుకుంటూ రంగ ప్రవేశం చెయ్యగానే సెల్ లో దూర్చిన సదరు తలకాయ వాళ్ళ వేపు దృష్టి సారించింది. ఇక నన్ను చూసినప్పుడు వాడిపోయిన ఆ గెడ్డం మాసిన కంప్యూటర్ కుర్రాడి మొహం ఇప్పుడు వెలిగి పోయింది. ఇక మాట్లాడుకున్న దాని ప్రకారం ఆ అమ్మాయిలకి నాలాగా జులపాల కటింగ్ తో పాటు మాలిస్ కూడా కావాలి అని అర్ధం అయింది. అంటే వాళ్ళ కాళ్ళని వేడి ఉప్పు నీళ్ళలో పెట్టి ఒక తతంగం, ఒళ్లంతా..బొటానికల్ ఆర్గానిక్  ఆయిల్ పూసి చేసే మసాజ్...కావాలిట. అదే లెండి మా చిన్నప్పుడు ఒక ఓడ్రం మంగలి నూనె పట్టించి ఒళ్ళంతా పిసికి హూనం చేసే దాన్ని మాలిస్ అనే వారు....ఇప్పుడు అదే పలు రకాల పేర్లతో మసాజ్ అంటున్నారు...చెప్పొద్దూ...కాకినాడ చాలా పురోగమించింది...అనిపించింది...నేను ఆ యువతీయువకుల కిచ కిచలు వింటూ అబ్బుర పడుతూ ఉండగా ఆ గెడ్డం మాసిన యువకుడి కన్నా ఎక్కువ గెడ్డం మాసిన మరొక యువకుడు..లేదా గెడ్డం ఎక్కువ మాసిన యువకుడు నా దగ్గరకి వచ్చి నేను మీ అంతు చూస్తాను..అనగా ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ యూ... లాంటి మాటలేవో అనేసి తనతో రమ్మన్నాడు. నేను ఆ గెడ్డాన్ని అనుసరించగా నన్ను ఒక అద్దం ముందు ఉన్న కుర్చీలో కూచోబెట్టాడు. ఇక్కడ నేను గమనించిన విచిత్రం ఏమిటంటే..అక్కడ క్షవరం చేయడానికి కావలసిన పరికరాలు..అనగా కత్తెరలు, ట్రిమ్మర్ లు, దువ్వెన్నలు...వగైరాలు కానీ, తల మీద నీళ్ళు చిలకరించే పిచికారీ సీసాలు కానీ ఏమీ లేవు. కుర్చీ, అద్దం, నేనూ అంతే..మరి ఈ గెడ్డం ఎక్కువ మాసిన యువకుడు తలమాసిన నాకు తన చేతివేళ్ళతోనే క్షవరము చేయునా

అనే అనుమానం వచ్చి వాడి చేతి వేళ్ళ కేసి చూశాను. అప్పటికే ఎక్కడి నుంచి తెచ్చాడో కానీ అతని చేతిలో ఒక సంచీలో ఒక కత్తెర, దువ్వెన కనపడి ఊపిరి పీల్చుకున్నాను.

ఇక్కడ నాకు అర్ధం అయిన ప్రత్యేకత ఏమిటంటే అమెరికాతో సహా, అన్ని దేశాలలోనూ, ఎక్కడ క్షవరం చేసే కుర్చీ ఉంటుందో అక్కడే ఒక డ్రెస్సర్ లో అన్ని పరికరాలూ ఉంటాయి. ఎదురుగా అద్దం ఉంటుంది. వినియోగదారుడి జులపానందానికి తగినట్టు అంట కత్తెర. బుల్లి చాకు, యంత్రం కటింగ్ ఇలా తీసుకుని క్షవర కల్యాణం చేస్తారు. ఈ అత్యాధునిక టోనీ & గైస్ సెలాన్ లో పద్ధతి వేరు. అన్ని పరికరాలూ, ద్రావకాలు, కత్తెరలు, దువ్వెనలు ఒక గదిలో నాలుగైదు బల్లల మీద పేర్చి ఉన్నాయి. పక్కనే కుర్చీ వేసుకుని ఒక అందమైన అమ్మాయి కంప్యూటర్ ముందు చతికిలపడి కూచుంది. నన్ను చక్రాల కుర్చీలో కూచోబెట్టిన గె. ఎ. మా.యు ఆ అమ్మాయి దగ్గరకి వెళ్ళి నా జుట్టు సంస్కరించడానికి కావలసిన సరంజామా ఏమిటో ఆ పిల్లకి చెప్పగానే ఆ అమ్మాయి కంప్యూటర్ లో అవి కొట్టి, దాని ప్రకారం అవన్నీ సేకరించి ఒక చిన్న సంచీలో పెట్టి అతని చేత సంతకం పెట్టించుకుని మరీ అతనికి ఇచ్చి మళ్ళీ తన సెల్ ఫోన్ లో ఆడుకోడానికి వెళ్ళిపోయింది. మన పవిత్ర భారత దేశం టెక్నాలజీని ఇంత గొప్పగా వాడుకోవడం చూసి నా కళ్ళు చెమ్మగిల్లాయి.



అమెరికాతో సహా యావత్ భూప్రపంచం లో ఏదేశమేగినా, ఏ మంగలి షాపులో కాలిడినా వాళ్ళు అడిగే మొదటి ప్రశ్న "ఎలా చెయ్యమంటావు?". ఇక్కడ కూడా అదే ప్రశ్న వస్తుంది కదా అనుకున్న నాకు ఇప్పుడు ఈ గె. ఎ. మా.యు. అడిగినది ఏమిటో అస్సలు తెలియ లేదు. కానీ ప్రశ్న ఊహించగలను కాబట్టి "మీడియమ్ కటింగ్ చెయ్యి. తిరుపతి వద్దు" అన్నాను నవ్వుతూ. వాడు ఎందుకో ఏడుపు మొహం పెట్టి మళ్ళీ ఏదో అన్నాడు. ఈ సారి నాది వెర్రి మొహం అయింది. వాడు ఏమన్నాడో అర్ధం అవలేదు. ఇలా కాస్సేపు మా కటింగ్ మీటింగ్ అవగానే మా ఇద్దరికీ భాషా దోషం ఉంది అని అర్ధం అయిపోయింది. అనగా ఆ మానవుడికి తెలుగు, ఇంగ్లీషు రెండూ రావు..ట. "సిరఫ్ హిందీ" అన్నాడు. ఇక్కడ మనం పప్పులో కాలు వేశాం. అనగా మనకి హిందీ నైజాంతా. ఇక చేతులూ, కాళ్ళు ఊపుకుంటూ, ముఖ కవళికలు మార్చుకుంటూ ప్రపంచ భాష అయిన మూగ జీవుల భాషలో మా ఆత్మీయ సంభాషణ కొనసాగింది. ఆంధ్ర ప్రదేశ్ నడిబొడ్డు అయిన కాకినాడలో ఉన్న ఒకానొక క్షవర శాల పేరు పరాయిది, భాష పరాయిది, అమ్మాయిలకి మాలిస్,...వావ్ దేశం పురోగమించింది..

మొత్తానికి కాకినాడలో ఒక అత్యాధునిక బ్రాండ్ ఇమేజ్ ఉన్న క్షవర శాల ఫ్రాంచైజ్మనం ప్రపంచం లో ఏ దేశం లో మెక్డొనాల్డ్స్ లో బర్గర్ తింటే ఒక్కలాగే ఎలా ఉంటాయో....ఈ టొనే & గై అనే ఒక అంతర్జాతీయ క్షవర శాల లో

జులపాలు కత్తిరించుకోడానికి వెళ్తే కెనడా లోనూ కాకినాడలోనూ ఒకే రకముగా మనకి క్షవరం చెయ్యబడును. ఇది నాకు ఖచ్చితంగా ఎలా తెలిసిందీ అంటే.....కల్యాణం అయ్యాక మళ్ళీ ఆ మొదటి గెడ్డం మాసిన యువకుడి దగ్గరికి వెళ్ళగానే వాడు కంప్యూటర్ లో కొట్టి నా బిల్లు ఎంతో చూపించాడు....మూడు వేల ఆరు వందల రూపాయలు మాత్రమే. అనగా...హ్యూస్టన్ లో లెక్క..40 డాలర్ల పైనే!....ఇక్కడికి రాక ముందే మా క్వీన్ విక్టోరియా మాట విని ఉంటే పది డాలర్లు మిగిలేవి కదా!.

**COMMENTS**